క్లుప్తంగా

సిరులతల్లికి అష్టదళ పద్మారాధన



అష్టదళ పద్మారాధనలో కనకమహాలక్ష్మి అమ్మవారు

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో మంగళ వారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో పి. శ్రీనివాసులరెడ్డి, ఏఈవోలు వెంపలి రాంబాబు, కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది, పలువురు భక్తులు పాల్గొన్నారు.

ఏసీపీకి అభినందనలు



ఏసీపీని అభినందిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

డాబాగార్డెన్స్: స్పెషల్ బ్రాంచ్ ఏసీపీగా నియమితులైన కింజరాపు ప్రభాకర్‌ను కేజీహెచ్ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు నీలాపు శ్రీనివాసరావుతో కలిసి పలువురు అసోసియేషన్ సభ్యులు మంగళ వారం మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. నిజాయితీ గల వ్యక్తి స్పెషల్ బ్రాంచ్ ఆఫీసర్‌గా రావడం సంతోషకరమని హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పి. లక్ష్మణమూర్తి, అప్పలస్వామి, నరేష్, చిరంజీవి, చంటి, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

ధ్యానాంజనేయ స్వామికి విశేష పూజలు



ధ్యానాంజనేయ స్వామి

డాబాగార్డెన్స్: భానోజీనగర్‌లో వెలసిన ధ్యానాంజనేయ స్వామికి మంగళవారం విశేష అభిషేకాలు, అర్చనలు, సంకల్ప హారతులు భక్తులు అందజేశారు. ఆలయ అర్చకుడు గోపాజ్యోస్యుల సత్య జగన్నాథశర్మ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరిగాయి. పెద్ద ఎత్తున భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

కేంద్ర ఉక్కు శాఖ మంత్రి స్పందించాలి

డాబాగార్డెన్స్: విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించటం లేదని, స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయిస్తామని కేంద్ర ఉక్కు శాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామి ప్రకటన చేయాలని సిటు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత 1200 రోజులుగా స్టీల్‌ప్లాంట్ కార్మికులు, ఉద్యోగులు, ప్రజలు పెద్ద ఎత్తున స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలని ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం స్పందించలేదన్నారు. ప్లాంట్‌ను దెబ్బ తీసే విధంగా కేంద్ర ప్రభుత్వం, స్టీల్ యాజమాన్యం చర్యలు ఉంటున్నాయన్నారు. స్టీల్‌ప్లాంట్‌కు అవసరమైన ముడి సరకు సమకూర్చకుండా తాత్సారం చేస్తున్నారని పేర్కొన్నారు. దేశంలోని అన్ని స్టీల్ పరిశ్రమలకు సొంత గనులు ఉన్నాయని, సొంత గనులు లేని ఏకైక ప్లాంట్ విశాఖ స్టీల్‌ప్లాంట్ అని, ఈ ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలన్నారు. మూసివేసిన బ్లాస్ట్ ఫర్నేస్–3ను వెంటనే ప్రారంభించి పూర్తి సామర్థ్యంతో స్టీల్‌ప్లాంట్ నడపాలన్నారు. నిర్వాసితులకు ఉపాధి కల్పించాలన్నారు. స్టీల్‌ప్లాంట్ తెలుగు వారి ఆత్మగౌరవమని, ప్రైవేటీకరణ చేస్తే సహించేది లేదని హెచ్చరించారు.

వేడుకగా జువ్వాలమ్మ పండగ

గోపాలపట్నం: జీవీఎంసీ 92వ వార్డు వెంకటాపురంలో జువ్వాలమ్మ పండగను మంగళ వారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బెహరా భాస్కరరావు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.ఆలయ అర్చకులు అమ్మవారి శేష వస్త్రాలు, తీర్థ ప్రసాదాలు అందించారు.

విద్యా సౌరభాలు

చదువుతో పాటు విద్యార్థినులను అన్ని రంగాల్లో తీర్చిదిద్దే లక్ష్యంతో బోధన అందిస్తోంది విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల. ల్యాబ్, చక్కటి తరగతి గదులు, ఆటలాడుకునేందుకు విశాలమైన మైదానం, లైబ్రరీ వంటి సౌకర్యాలతో సేవలందిస్తోంది. సింగిల్ మేజర్ సబ్జెక్ట్ విధానంలో బోధన కొనసాగే ఈ కళాశాలలో బీఏ, బీకాం, బీఎస్సీ గ్రూపులకు సంబంధించి 800 సీట్లు అందుబాటులో ఉన్నాయి.

- బోధనలో దూసుకుపోతున్న విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల
- విద్యార్థినులకు అందుబాటులో అనేక కోర్సులు
- ప్రైవేట్‌కు దీటుగా సేవలు
- సింగిల్ మేజర్ సబ్జెక్ట్ విధానంలో అందుబాటులో 800 సీట్లు



విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల

డాబాగార్డెన్స్: ఎందరో విద్యార్థినుల ఉపాధికి బాట వేసిన కళాశాల.. విద్యతో పాటు నైపుణ్యం.. క్రీడలు.. సాంస్కృతిక.. సామాజిక రంగాల్లో పిల్లలను తీర్చిదిద్దుతున్న కళాశాల విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల. నగర నడిబొడ్డున పచ్చని చెట్ల మధ్య ఆహ్లాదకర వాతావరణంలో ఈ చదువుల ప్రాంగణం నిర్వహించబడుతోంది. దేశంలోనే నేక్ ఏ+ గ్రేడ్ సాధించిన తొలి మహిళా డిగ్రీ కళాశాలగా గుర్తింపు పొంది ఇటీవలే స్వయం ప్రతిపత్తి హోదా సాధించింది.

దశాబ్దాలుగా విద్యా సౌరభాలు వెదజల్లుతూ..

విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల 1975 నుంచి విద్యారంగంలో తన వంతు పాత్ర పోషిస్తూ ముందుకు సాగుతోంది. ప్రతి సంవత్సరం వేలాది మంది విద్యార్థులను సమున్నతంగా తీర్చిదిద్దుతూ విశాఖ జిల్లాలో గల ఏకైక ప్రభుత్వ మహిళా కళాశాలగా గుర్తింపు పొందింది. జాతీయ స్థాయిలో గుణాత్మకమైన విద్యనందిస్తూ అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా విద్యాబోధనలో సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడిస్తూ విద్యనందిస్తోంది.

అన్ని రంగాల్లో విద్యార్థులను తీర్చిదిద్దుతూ..

విశాలమైన తరగతి గదులు, ఉన్నత ప్రమాణాలు కలిగిన బోధనా సిబ్బంది, ప్రయోగశాలలు కలిగి ఉంది. విద్యార్థులకు డిజిటల్, వర్చువల్ తరగతులు.. మూక్స్ వంటి ఆన్‌లైన్ కోర్సులు కూడా ఇక్కడ నిర్వహిస్తున్నారు. విద్యార్థినులకు పోటీ పరీక్షల్లో ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు.



అధునాతన సైన్స్ ల్యాబ్

ఆంధ్ర విశ్వవిద్యాలయం నిర్వహించిన ఆసెట్ పరీక్షలో కళాశాల విద్యార్థినులు ఉత్తమ ర్యాంకులు సాధించారు. ప్రతి ఏడాది కళాశాల జవహర్ నాలెడ్జి సెంటర్(జేకేసీ) ద్వారా నిర్వహించే క్యాంపస్ డ్రైవ్‌లు, జాబ్ మేళాల్లో కళాశాల విద్యార్థినులు ఉపాధి పొందుతున్నారు. జాతీయ స్థాయిలో సెమినార్లు, వర్క్‌షాపులు నిర్వహిస్తూ విద్యార్థినులను సాంకేతిక విజ్ఞానాభివృద్ధి దిశగా ప్రోత్సహిస్తున్నారు. ప్రతిభావంతులైన విద్యార్థినులకు హెచ్‌పీసీఎల్ మెరిట్ స్కాలర్‌షిప్స్ అందజేస్తోంది. కేవలం చదువులకే కాకుండా, విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి ఆటలు, ఎన్‌సీసీ, ఎన్‌ఎస్‌ఎస్ వంటి సేవా కార్యక్రమాల్లో కూడా భాగస్వామ్యం కల్పిస్తున్నారు. కరాటేలో శిక్షణ, సాహిత్యం, నాట్యం, కవిత్వం వంటి వాటిలో కూడా ప్రోత్సహిస్తున్నారు.



విద్యార్థినుల క్రీడల కోసం చక్కటి మైదానం

ప్రవేశాలకు వేళాయె..

మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో మొదటి సంవత్సరంలో చేరాలనుకునే విద్యార్థులకు సింగిల్ మేజర్ సబ్జెక్ట్ విధానంలో బీఏ, బీకాం, బీఎస్సీ గ్రూపులకు సంబంధించి 800 సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఇంటర్‌లో ఉత్తీర్ణులైన విద్యార్థినులు ఈ నెల 10వ తేదీలోగా తమ పేర్లు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవడానికి, 11 నుంచి 15 వరకు వెబ్ ఐచ్ఛికాలు నమోదు చేసుకోవడానికి రాష్ట్ర ఉన్నత విద్యామండలి అవకాశం కల్పించింది.

కోర్సులు ఇలా..

బీఏ హిస్టరీ, బీఏ ఎకనామిక్స్, బీఏ పొలిటికల్ సైన్స్, బీకాం కంప్యూటర్ అప్లికేషన్స్, బీకాం డిజిటల్ మార్కెటింగ్, బీకాం హెల్త్ కేర్ మేనేజ్‌మెంట్, బీకాం రిటైల్ ఆపరేషన్స్, బీఎస్సీ మ్యాథమెటిక్స్, బీఎస్సీ ఫిజిక్స్, బీఎస్సీ కంప్యూటర్ సైన్స్, బీఎస్సీ కెమిస్ట్రీ, బీఎస్సీ బోటనీ, బీఎస్సీ మైక్రో బయాలజీ, బీఎస్సీ జువాలజీ, బీఎస్సీ బయోటెక్నాలజీ కోర్సులు ఇక్కడ అందుబాటులో ఉన్నాయి.



లైబ్రరీలో పోటీ పరీక్షలకు ప్రిపేరవుతున్న విద్యార్థినులు

ప్రైవేట్.. కార్పొరేట్‌కు దీటుగా..



ప్రైవేట్.. కార్పొరేట్ కళాశాలలకు దీటుగా ప్రభుత్వ మహిళా కళాశాల విద్యార్థినులు అన్ని రంగాల్లో దూసుకుపోతున్నారు. అనుభవజ్ఞులైన అధ్యాపకులచే నాణ్యమైన విద్యా బోధన, ప్రభుత్వం నిర్ణయించిన నామమాత్రపు ఫీజుల సదుపాయం, అత్యాధునిక పరికరాలతో కూడిన సైన్స్ ల్యాబ్‌లు, ఇంగ్లీషు ల్యాబ్ ద్వారా స్పోకెన్ ఇంగ్లీషు, కమ్యూనికేషన్ స్కిల్స్, సువిశాలమైన రీడింగ్ హాల్, పోటీ పరీక్షలకు ఉపయోగపడే పుస్తకాలు, మ్యాగజైన్స్ చదువుకునే అవకాశం కల్పించాం. మెరిట్ స్టూడెంట్లతో కళాశాల ప్రగతిపథం వైపు దూసుకుపోతోంది.

– డాక్టర్ మంజుల, ప్రిన్సిపాల్, విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ, పీజీ కళాశాల

కెరీర్ గైడెన్స్‌పై విద్యార్థినులకు అవగాహన



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ మంజుల

డాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో కళాశాల జేకేసీ, ఐక్యూఏసీ, రసాయన శాస్త్ర విభాగం, గ్లోరియస్ ఐఏఎస్ అకాడమీ సంయుక్తంగా మంగళవారం కెరీర్ గైడెన్స్‌పై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్. మంజుల విద్యార్థినులనుద్దేశించి మాట్లాడారు. ప్రస్తుత పోటీ ప్రపంచాన్ని ఎలా ఎదుర్కోవాలి? విద్య అనంతరం ఎలా స్థిరపడాలి? అనే అంశాలపై మార్గ నిర్దేశం చేశారు. గ్లోరియస్ ఐఏఎస్ అకాడమీ డైరెక్టర్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ పోటీ ప్రపంచంలోని అభ్యర్థుల కోసం ఒక యాప్ రూపొందించినట్టు చెప్పారు. యాప్ ద్వారా సులభంగా సమాచార సేకరణ వీలవుతుందని, తక్కువ ఖర్చుతో తక్కువ సమయంలో ఎక్కువ సమాచారాన్ని అభ్యర్థులు సేకరించి వినియోగించుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ బి. సంతోషి అనూష, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి డి. అరుణపద్మ, రసాయనశాస్త్ర అధ్యాపకురాలు డాక్టర్ కె. కల్యాణ్‌రామ్, అధిక సంఖ్యలో విద్యార్థినులు పాల్గొన్నారు.

‘స్టాప్ డయేరియా’పై అవగాహన కల్పించాలి



భీమ్‌నగర్ యూపీహెచ్‌సీ సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట: ‘స్టాప్ డయేరియా’ కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు అన్నారు. మంగళవారం భీమ్‌నగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాతా శిశు ఆరోగ్య సేవల గురించి ఆరోగ్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అడల్ట్ బీసీజీ వ్యాక్సిన్, గర్భిణులకు అందుతున్న సేవలను తనిఖీ చేసి, గర్భిణులకు ఐరన్ మాత్రలు ఇవ్వాలని తెలిపారు. ఎనీమియాపై ఏఎన్‌ఎం, ఆశ కార్యకర్తలు, సూపర్‌వైజర్లతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. యూపీహెచ్‌సీల్లో సాధారణ ప్రసవాలు జరిగేలా చూడాలని ఏఎన్‌ఎం, ఆశ కార్యకర్తలు, వైద్యాధికారులకు తెలిపారు. సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. ప్రతీ శుక్రవారం ఫ్రైడే–డ్రైడే పాటించాలని తెలిపారు. పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా సీనియర్ సివిల్ జడ్జి శేషమ్మ



పాల్గొన్న ఆర్‌టీఏ సిబ్బంది, ప్రజలు

మహారాణిపేట: ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే చాలా వరకు రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చునని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎం.వెంకట శేషమ్మ తెలిపారు. మంగళవారం మాధవధారలో ఆర్‌టీఏ కార్యాలయంలో సిబ్బంది, ప్రజలకు మోటారు వాహన చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ద్విచక్ర వాహన చోదకులు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని, కారులో ప్రయాణించిన వారు సీటు బెల్టు పెట్టుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌టీవో జె.రామ్‌కుమార్, ఆర్‌టీఏ సిబ్బంది, పోలీసులు అధికారులు పాల్గొన్నారు.అనంతరం ట్రాఫిక్ చట్టాలపై విద్యార్థులకు విశాఖ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో గొల్లలపాలెంలోని శ్రీ చైతన్య విద్యా సంస్థల్లో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి సీనియర్ సివిల్ జడ్జి ఎం.వి.శేషమ్మ పాల్గొని పలు విషయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. హైకోర్టు ఆదేశాల మేరకు ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని సీనియర్ జడ్జి శేషమ్మ కోరారు.

పరిశుభ్రంగా బీచ్ పరిసరాలు



గోకుల్ పార్క్ వద్ద పరిసరాలను పరిశీలిస్తున్న కమిషనర్ సాయికాంత్ వర్మ

డాబాగార్డెన్స్: కోస్టల్ బ్యాటరీ నుంచి ఆర్.కె.బీచ్ వరకు పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ అధికారులను ఆదేశించారు. జీవీఎంసీ అదనపు కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్, ఇతర అధికారులతో కలిసి మంగళవారం కోస్టల్ బ్యాటరీ నుంచి ఆర్.కె.బీచ్ వరకు పర్యటించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన నేపథ్యంలో కోస్టల్ బ్యాటరీ వద్ద గల హెలీ ప్యాడ్ పరిసరాలు పరిశీలించారు. బీచ్ పరిసరాల్లో వ్యర్థాలు లేకుండా పరిశుభ్రత చర్యలు చేపట్టాలని ప్రధాన వైద్యాధికారి నరేష్‌కుమార్‌ను, జోన్–4 జోనల్ కమిషనర్ ప్రసాదరావును ఆదేశించారు. రోడ్లపై గుంతలు లేకుండా చూడాలని, అందంగా తీర్చిదిద్దాలని ప్రధాన ఇంజినీర్ రవికృష్ణరాజు, పర్యవేక్షక ఇంజనీర్ సత్యనారాయణరాజును ఆదేశించారు. సెంటర్, సైడ్ మీడియన్లు, బీచ్ గార్డెన్లలో అవసరమైన చోట్ల కొత్త మొక్కలు నాటాలని డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ హార్టికల్చర్ దామోదరరావుకు సూచించారు.

నేడు విదేశీ వైద్య విద్యపై అవగాహన

సీతమ్మధార: విదేశాల్లో వైద్య విద్యలో రాణించేందుకు విద్యార్థులకు మార్గనిర్దేశం చేసేందుకు ఓక్స్ ఓవర్సీస్ ఎడ్యుకేషనల్ కన్సల్టెన్సీ కృషి చేస్తుందని సీనియర్ కౌన్సెలర్లు మల్లికార్జున్, ధనరాజ్ తెలిపారు. ద్వారకానగర్‌లోని సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. విదేశాల్లో ఎంబీబీఎస్ చదువుకు కావాల్సిన అర్హతలను విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు తెలియజేసేందుకు గైడెన్స్ ప్రోగ్రాం ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమం దొండపర్తిలోని బెస్ట్‌వెస్టన్ హోటల్‌లో బుధవారం ఉదయం 11 నుంచి 5 గంటల వరకు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నెదర్లాండ్స్, రష్యా, ఇటలీలో ఎంబీబీఎస్ విద్యకు సంబంధించి వివరాలు తెలియజేస్తామన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు, తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ముందస్తు చర్యలతోనే వ్యాధుల నివారణ



సిబ్బందితో చర్చిస్తున్న డీఎంవో డాక్టర్ తులసి

మహారాణిపేట: డెంగ్యూ, మలేరియా వ్యాప్తి చెందకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని జిల్లా మలేరియా అధికారి (డీఎంవో) డాక్టర్ తులసి అన్నారు. మంగళవారం కేజీహెచ్‌లో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఇక్కడ వారం పొడవునా వివిధ బ్లాకుల్లో నిఘా నిర్వహిస్తున్నామన్నారు. ఒక్కొక్క బృందంలో ఏడుగురు సభ్యులు ఉంటారని, మొత్తం మూడు బృందాలను ఏర్పాటు చేశామన్నారు. కేజీహెచ్‌లో దోమల సంచారం ఎక్కువగా ఉండే 9 ప్రాంతాలను గుర్తించామని, నవంబర్ వరకు నిరంతర పర్యవేక్షణ ఉంటుందన్నారు. డెంగ్యూ, మలేరియా నివారణకు కేజీహెచ్‌లో జీవీఎంసీ మలేరియా నివారణ విభాగం ద్వారా చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చించారు. ఈ సమావేశంలో సబ్ యూనిట్ అధికారులు శ్రీనివాసాచార్యులు, శేషుబాబు, హెల్త్ సూపర్‌వైజర్ మోహన్‌దత్తా, హెల్త్ అసిస్టెంట్ చలం తదితరులు పాల్గొన్నారు.

వైద్యంలో మత్తుమందు వినియోగంపై సదస్సు

మహారాణిపేట: శస్త్ర చికిత్స చేసే రోగులకు మత్తు మందు ఇవ్వడంలో కొత్త పద్ధతులకు శ్రీకారం చుట్టినట్లు డాక్టర్ కూర్మనాథ్ తెలిపారు. సాధారణంగా శస్త్ర చికిత్స సమయంలో గ్యాస్ వినియోగిస్తూ మత్తుమందు ఇస్తారు. ప్రస్తుతం ప్రత్యేక పంపు ద్వారా ఇంజెక్షన్లు రోగికి ఇవ్వడంపై సదస్సులో ప్రధానంగా చర్చ జరిగింది. ఈ విధానం వల్ల ఆస్పత్రిలో తక్కువ సమయం ఉండటం, ఖర్చు తగ్గటం, సైడ్ ఎఫెక్ట్స్ లేకుండా ఉంటుందని కూర్మనాథ్ తెలిపారు. కొమ్మాదిలోని గాయత్రి విద్యా పరిషత్ మెడికల్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ట్రస్ట్ సెక్రటరీ పి. సోమరాజు, మెడికల్ డీన్ డాక్టర్ సుబ్బారావు, డైరెక్టర్ డాక్టర్ వరప్రసాద్, పలువురు వైద్యులు పాల్గొన్నారు.

బొత్సకు జన్మదిన శుభాకాంక్షలు



బొత్స సత్యనారాయణకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న బొడ్డేటి తదితరులు

అల్లిపురం: మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ జన్మదినం సందర్భంగా 33వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకుడు బొడ్డేటి ప్రసాద్, శరగడం మోహన్, కోరిబిల్లి శ్యామ్ తదితరులు మంగళవారం సాయంత్రం మర్యాదపూర్వకంగా కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

కల్యాణం.. కమనీయం



యజ్ఞోపవీతధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

కిరాత వారాహి మాతకు ప్రత్యేక పూజలు



విశేష అలంకరణలో కిరాత వారాహి మాత



లలితా సహస్ర నామాలు జపిస్తున్న మహిళలు

అల్లిపురం: భక్తుల విశేష పూజలందుకుంటున్న అల్లిపురంలోని శ్రీ షిర్డీసాయి దర్బార్‌లో వెలసిన శ్రీ వారాహి అమ్మవారి నవరాత్రులు ఘనంగా నిర్వహిస్తున్నారు. నాల్గవ రోజు మంగళవారం అమ్మవారు కిరాత వారాహిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు అమ్మవారిని వేపకొమ్మలతో విశేషంగా అలంకరించి షోడసోపచార సేవల అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. మహిళలు అమ్మవారికి కుంకుమ పూజలు చేసి అమ్మవారిని వారాహి స్తోత్రంతో కీర్తించి తాంబూలాలు ఇచ్చి పుచ్చుకున్నారు. సాయంత్రం అమ్మవారి సన్నిధిలో సామూహిక లలితా సహస్ర నామాలు ఆలపించారు. అనంతరం అమ్మవారికి విశేష హారతులిచ్చారు.

పోలీసుల సంక్షేమమే ప్రధాన ధ్యేయం



మాట్లాడుతున్న సీపీ శంఖబ్రత బాగ్చీ

మహారాణిపేట: పోలీసు సిబ్బంది సంక్షేమమే ప్రధాన ధ్యేయమని నగర పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చీ అన్నారు. మంగళవారం కేజీహెచ్‌లో నిర్వహించిన మెడికల్ క్యాంపులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసు సిబ్బందికి పరీక్షలు చేయాలని తాను కోరిన వెంటనే కేజీహెచ్ సూపరింటెండెంట్ స్పందించారని తెలిపారు. సిబ్బందిని పరీక్షించేందుకు స్పెషలిస్టు వైద్యులను కూడా పిలిచారని తెలిపారు. ఈ శిబిరాన్ని రెండు వారాల పాటు కొనసాగిస్తారని, ప్రతి పోలీసు ఈ శిబిరాన్ని వినియోగించుకోవాలన్నారు. కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్ మాట్లాడుతూ విధి నిర్వహణలో ఎల్లప్పుడు బిజీగా ఉండే పోలీసులకు కూడా వైద్య పరీక్షలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. జనరల్ మెడిసిన్, ఎండోక్రైనాలజీ, నెఫ్రాలజీ, బయో కెమిస్ట్రీ, మైక్రోబయాలజీ విభాగాలతో చర్చించి వారిని కూడా శిబిరాలకు ఆహ్వానించామన్నారు. ఇదిలా ఉండగా గత నెల సుమారు 3500 మంది పోలీసు సిబ్బందికి వివిధ పరీక్షలు నిర్వహించారు. మంగళవారం నాటి మెడికల్ క్యాంపులో వారిలో 49 మంది పోలీసులకు వైద్య సేవలు అందించి మందులు ఇచ్చారు. వీరిలో ఒకరికి శస్త్ర చికిత్స చేయవలసినదిగా వైద్యులు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎండోక్రైనాలజీ విభాగాధిపతి డాక్టర్ కేవీపీ సుబ్రహ్మణ్యం, ఏఆర్‌ఎంవో డాక్టర్ డి.భాస్కరరావు, డాక్టర్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ మోడల్ విన్నర్స్ సక్సెస్ మీట్



సక్సెస్ మీట్‌లో పాల్గొన్న నిర్వాహకురాలు ఉషారాణి, విజేతలు

సీతంపేట: క్వీన్ ఈవెంట్స్ ఆధ్వర్యంలో జూనియర్ మోడల్ సీజన్ 4 ఫైనల్స్ ఇటీవల విశాఖ నగరంలో ఘనంగా జరిగాయి. ఎం.ఉషారాణి నిర్వహణలో జరిగిన పోటీలకు విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా పోటీలో గెలిచిన చిన్నారులతో కలిసి నిర్వాహకురాలు ఉషారాణి మంగళవారం ద్వారకా నగర్ పౌరగ్రంథాలయంలో సక్సెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చదువుతో పాటు పిల్లల్లో ఉన్న సృజనాత్మకతను వెలికితీయడంలో భాగంగా ఇటువంటి పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. మూడు కేటగిరీల్లో నిర్వహించిన ఈపోటీల్లో 120 మంది పిల్లలు పాల్గొన్నారని, ఫైనల్స్‌కు 50 మంది ఎంపికైనట్టు తెలిపారు. జూనియర్ కేటగిరీ–1లో లాలిత్య సమ్మోహణ మొదటి బహుమతి గెలుపొందగా, భవిష్య, వై. హర్షిణి ద్వితీయ, తృతీయ స్థానాలలో నిలిచారన్నారు. సీనియర్ కేటగిరీ–1లో షేక్ రోషిణి విన్నర్ కాగా, ఎస్. చైత్ర, సంజన రెండు మూడు స్థానాలలో గెలుపొందారన్నారు. స్పెషల్ కేటగిరీలో వి.కృష్ణ రియాన్స్ జూనియర్ సబ్‌టైటిల్ గెలిచారన్నారు. ఈ సందర్భంగా చిన్నారులతో కేక్ కట్ చేసి అందరినీ అభినందించారు.

చిన్నారులకు స్కూల్ బ్యాగుల వితరణ



చిన్నారులకు సామగ్రి అందజేస్తున్న అతిథులు

కంచరపాలెం : స్థానిక కంచరపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో పీఏబీ ఎల్‌ఈడీ వాల్స్ అధినేత అజేయ్ జాన్‌వెస్లీ మంగళవారం చిన్నారులకు స్కూల్ బ్యాగులు, చిత్రలేఖనం సామగ్రి పంపిణీ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ విజయలక్ష్మి, పెంటకోట శ్రీనివాసరావు, మార్తామ్మ, వాసు, దివ్య, కుమార్, సంస్థ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.